క్లుప్తంగా

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి



తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, తెయూ ఎస్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు శ్రీశైలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెయూ కాంట్రాక్టు అధ్యాపకుల నిరవధిక సమ్మెకు శుక్రవారం పీడీఎస్‌యూ, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు వేర్వేరుగా మద్దతు తెలిపారు. నాయకులు సునీల్, శివసాయి, రవీందర్ ,ఆకాష్, ఎస్‌ఎస్‌యూఐ నాయకులు అభినయ్, రాజేందర్, రాజ్‌కుమార్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సిరికొండ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్య ఆరోగ్య శాఖ అధికారి అరవింద్ సిబ్బందికి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు సీజనల్ వ్యాధులపై అవగాహన సమావేశం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ.. డయేరియా, విష జ్వరాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎంపీడీవో లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



ఇందల్వాయి: మండలంలోని నల్లవెల్లి క్లస్టర్ గ్రామాలలో అధిక వర్షాలకు దెబ్బతిన్న వరి, సోయా పంటలను ఏఈవో శ్రీహరి శుక్రవారం పరిశీలించారు. పంట నష్టపోయిన రైతుల వివరాలను ఉన్నతాధికారులకు అందిస్తామని ఏఈవో తెలిపారు. ప్రస్తుతం వరిలో కాండం తొలుచు(మొగి) పురుగు ఉధృతి ఎక్కువయ్యే అవకాశం ఉందని, నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పీ లేదా, క్లోరాంతనిలిప్రోల్ లామ్డా సైహలోత్రిన్ మందులను అధికారుల సూచన మేరకు పిచికారి చేసుకోవాలని సూచించారు. వరి నాటిన 50 రోజుల తర్వాత యూరియా వాడకం నిలిపివేయాలన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



ఖలీల్‌వాడి: కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం వైఎస్సార్ తెలంగాణ పార్టీ నగర అధ్యక్షుడు ప్రవీణ్, నగర యూత్ అధ్యక్షుడు సంతోష్, బీసీ అధ్యక్షుడు రవి, 50 మంది నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శుక్రవారం వీరికి టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కేశ వేణు కాంగ్రెస్ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలని మహేష్‌కుమార్‌గౌడ్ కోరారు. జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, జావీద్ అక్రం ఉన్నారు.

డయాలిసిస్ కొత్త సెంటర్‌ను ప్రారంభించండి



ఖలీల్‌వాడి: జిల్లా జనరల్ ఆస్పత్రిలో డయాలిసిస్ కొత్త సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు సయ్యద్ కై సర్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఆర్‌ఎంవో డాక్టర్ తాహెరాకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా కై సర్ మాట్లాడుతూ.. పాత సెంటర్‌లో మిషన్లు రిపేర్‌లో ఉన్నాయని, కొత్త సెంటర్ పూర్తి అయినా ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పేదలకు సేవలందించాలని తెలిపారు. మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ లాయిన్ జహీర్, డాక్టర్ సాదక్, అన్వర్ తదితరులు ఉన్నారు.

వీఆర్‌ఏలను సొంత జిల్లాకు రప్పించాలి

- వీఆర్‌ఏ జేఏసీ డిమాండ్
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



కలెక్టర్‌ను కలిసి సమస్యలు వివరిస్తున్న వీఆర్‌ఏ జేఏసీ ప్రతినిధులు

సుభాష్‌నగర్: జిల్లా నుంచి వివిధ జిల్లాలకు రికార్డు అసిస్టెంట్లుగా, జూనియర్ అసిస్టెంట్‌గా, వార్డు ఆఫీసర్లుగా ఉద్యోగ రీత్యా వెళ్లిన వారిని సొంత జిల్లాలకు రప్పించేలా చర్యలు తీసుకోవాలని వీఆర్‌ఏ జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శుక్రవారం నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ.. జిల్లాలోని 200 మంది వరకు వీఆర్‌ఏలు మహబూబ్‌నగర్, సూర్యాపేట్, నల్గొండ, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, యాదాద్రి భువనగిరి, హన్మకొండ, నారాయణపేట, రంగారెడ్డి, జిల్లాలకు వెళ్లారని తెలిపారు. తమకు అక్కడ ఎలాంటి సదుపాయాలు లేవని, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. మహిళలు, వికలాంగులు ఉన్నందున తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. వివిధ జిల్లాలకు వెళ్లిన 201మందిని జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో భర్తీ చేయాలని విజ్ఞప్తిచేశారు. ఇతర జిల్లాలకు వెళ్లిన రికార్డ్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు, వీఆర్‌ఏ జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువైద్యశాల

- భయాందోళనలో సిబ్బంది
- ధర్పల్లి మండలకేంద్రంలో దుస్థితి



ధర్పల్లిలో శిథిలావస్థకు చేరిన పశు వైద్యశాల

ధర్పల్లి: మూగజీవాలకు వైద్యం అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం పశువైద్యశాలలను ఏర్పాటు చేసింది. వైద్యసేవలు అందిస్తున్నా, కొత్త భవనాల నిర్మాణంలో మాత్రం ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదు. ధర్పల్లిలో యాభై ఏళ్ల క్రితం నిర్మించిన పశువైద్యశాల ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. దీంతో పశువైద్య సిబ్బందితోపాటు వైద్యశాలకు వచ్చే వారు కూడా అనేక అవస్థలు పడుతున్నారు. భవనం ఏ క్షణాన కూలిపోతుందో తెలియక సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. చిన్నపాటి వర్షాలు కురిస్తే పైకప్పు నుంచి వర్షపునీరు గదుల్లోకి చేరుతుంది. పశువైద్యశాలలో ఉన్న మందులతో పాటు రికార్డులు తడిసి ముద్దయిపోతున్నాయి. శిథిలావస్థకు చేరిన భవనాలకు కనీస మరమ్మతులు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలో మొత్తం గొర్రెలు 14,320, గేదెలు 6,668, మేకలు 4,200, ఆవులు 3,600 ఉన్నాయి. ఈ పశు వైద్యశాలలో జీవాలకు వైద్యం అందించడానికి ఇన్‌చార్జి పశువైద్యాధికారితో పాటు ఇద్దరు సిబ్బంది మాత్రమే ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి శిథిలావస్థ భవనం స్థానంలో కొత్త భవనం నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యే టికెట్ల కోసం దరఖాస్తు





హైదరాబాద్‌లో దరఖాస్తు అందజేస్తున్న డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె భూమన్న.. మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి

డిచ్‌పల్లి: బీజేపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ కోసం డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె భూమన్న దరఖాస్తు చేసుకున్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన తన దరఖాస్తును అందజేశారు. నాయకులు వినోద్‌రెడ్డి, సురేందర్, దుర్గేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయి: బీజేపీ ఎమ్మెల్యే టికెట్ కోసం ధర్పల్లి మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి దరఖాస్తు చేసుకున్నారు. ఈమేరకు హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన దరఖాస్తు అందజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిజామాబాద్‌నాగారం: విద్యుత్ మరమ్మతుల కారణంగా నగరంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండనున్నట్లు ఏడీఈలు టౌన్-1, 2, చంద్రశేఖర్, తోట రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు పవర్ హౌస్ – న్యూ కలెక్టర్ ఆఫీస్ ఉప కేంద్రాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

రైల్వేగేట్‌ను తెరిపించాలి



ధర్నా చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ఖలీల్‌వాడి: గాంధీగంజ్, శ్రద్ధానంద్ గంజ్ సమీపంలోగల మూసివేసిన రైల్వేగేట్‌ను వెంటనే తెరిపించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి శివకుమార్ పేర్కొన్నారు. రైల్వేగేట్ పరిరక్షణ సమితి చేస్తున్న ధర్నాకు శుక్రవారం ఆయన మద్దతు పలికారు. శివకుమార్ మాట్లాడుతూ.. రైల్వేగేట్ మూసివేతతో చిరువ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గేట్ తెరవకుంటే ప్రజలను సమీకరించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. నాయకులు సాయికుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న సిరికొండ గ్రామస్తులు

సిరికొండ: సిరికొండ గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు శుక్రవారం ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు విన్నవించారు. హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను వారు కలిసి గ్రామంలో నెలకొన్న సమస్యలను వివరించారు. సిరికొండకు ఐటీఐ కళాశాల మంజూరు చేసినందుకు పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. మండల కేంద్రంలో మూడు వైకుంఠధామాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వీడీసీ చైర్మన్ సంతోష్, వైస్ చైర్మన్ గంగారాం, లింగం, శ్రీధర్, సురేష్, శివారెడ్డి, ధర్మపురి,చింటు,మధు,ప్రకాష్, రాజు పాల్గొన్నారు.

నూతన కార్యావర్గం ఎన్నిక..

జిల్లా బీసీ ఉద్యోగ సంఘం..



నిజామాబాద్‌నాగారం: నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం బీసీ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కరిపే రవీందర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా చిట్టి నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చంద్రమోహన్ ఎన్నికయ్యారు. రవీందర్ మాట్లాడుతూ.. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లల్లో రిజర్వేషన్లను కల్పించాలని కోరారు. నూతన కార్యవర్గాన్ని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ అభినందించారు. నాయకులు బుస్స ఆంజనేయులు, ఆకుల ప్రసాద్, దర్శనం దేవేందర్, శ్రీలత పాల్గొన్నారు.

నియామకం..



జక్రాన్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన జక్కం కార్తీక్ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్ శుక్రవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈసందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ.. ముదిరాజ్‌లను చైతన్యం చేసి వారి అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు.

ఆధ్యాత్మికం

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్, జక్రాన్‌పల్లి గ్రామాల్లో శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. యాదవ సంఘం సభ్యులు ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. జక్రాన్‌పల్లి సరస్వతి మోడల్ స్కూల్‌లో చిన్నారులు ఉట్టి కొట్టారు. కృష్ణా, గోపిక వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.



వైభవంగా నందోత్సవము



నిజామాబాద్ సిటీ: నగరంలో శుక్రవారం ఇస్కాన్ నిజామాబాద్ ద్వారకనగర్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా నందోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇస్కాన్ అధ్యక్షుడు సిద్ధ బలరాం దాస సమక్షంలో కృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇస్కాన్ సంస్థాపకాచార్య పరమపూజ్య భక్తి వేదాంతాస్వామి శీల ప్రభుపాద వారి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. అలాగే

ఇస్కాన్ కంఠేశ్వర్ ఇందూర్ ఆధ్వర్యంలో ముబారక్‌నగర్ కేంద్రంలో శీల ప్రభుపాద వారి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రామానంద రాయి గౌరవ దాస్, నిత్యానంద దాస్, స్వామి యాదవ్, రాజ్‌కుమార్ ప్రభు, రఘుపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



బాడ్సిలో సంపద వనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కూలీల సంఖ్య పెంచేలా సిబ్బంది చర్యలు చేపట్టాలని డీఆర్‌డీవో చందర్ నాయక్ సూచించారు. మండలంలోని బాడ్సిలో శుక్రవారం ఆయన సంపద వనాన్ని పరిశీలించారు. అనంతరం నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, మొక్కల పెంపకం తదితర అంశాలపై క్షేత్రస్థాయి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈసందర్భంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్‌ఏలు, టీఏలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలు లోతట్టు ప్రాంతాల్లో ఉండి, తరచూ నీరు నిల్వ ఉంటే.. అందులో మట్టి తరలించేందుకు అవసరమైన అనుమతులు పొందాలని సూచించారు. అలాగే పూడుకుపోయిన పంట కాల్వలు, పిచ్చి మొక్కలు పెరిగిన కాల్వలను గుర్తించాలన్నారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు ఎండిపోతే, వాటి స్థానంలో వేరే మొక్కలు నాటాలని సూచించారు. ఎంపీవో ఇక్బాల్, ఏపీవో సునీత, ఈసీ సాగర్, టీఏ సరిత, సంపూర్ణ, సాయి ఉన్నారు.

సంక్షిప్తం

ఉపాధ్యాయులకు సన్మానం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): నగరశివారులోని బోర్గాం(పి) జెడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అంతకుముందు ఉపాధ్యాయ దినోత్సవం రోజు ఉత్తమంగా బోధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. నాణ్యమైన విద్యాబోధనతో విద్యార్థులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత మనపై ఉందని తెలిపారు. ఉపాధ్యాయులు సాగర్, అరుణ్‌కుమార్ శర్మ, సంధ్యారాణి, విజయలక్ష్మీ, శ్రీదేవి, పీడీ అబ్బయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పోడు పట్టాలు ఇవ్వాలి



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని మంచిప్ప పరిసర ప్రాంతాల్లో పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, గిరిజనులపై పెట్టిన కేసులు ఎత్తేయాలని, పల్లె దవాఖాన ఏర్పాటు చేయాలని గ్రామసభ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. శుక్రవారం మండలంలోని మంచిప్ప రైతు వేదికలో సర్పంచ్ ఇందూరి సిద్ధార్థ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా రాజులమర్రిపై ఉన్న 60ఎకరాల భూమిలో సీజనల్ పంటలు వేసుకునేందుకు అవకాశమివ్వాలని, ఆ భూమి మొక్కలు నాటేందుకు అనువైనది కాదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఆ స్థలం గిరిజనులకు వర్తింపజేయాలని గ్రామసభ తీర్మానం చేసింది. తీర్మాన కాపీలను ఫారెస్ట్ అధికారులకు అందజేశారు. ఉపసర్పంచ్ జగదీష్, అజీమ్, వీడీసీ అధ్యక్షుడు నవీన్, నాయకులు సాయిరాం, శ్రీనివాస్, రాజేష్ పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన నుడా చైర్మన్



నిజామాబాద్‌నాగారం: ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను శుక్రవారం నుడా చైర్మన్ ఈగ గంగారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. టీఎస్ ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆధ్వర్యంలో ఆయన హైదరాబాద్ సెక్రటేరియట్‌లో మంత్రిని కలిశారు. సంజీవరెడ్డిని కేటీఆర్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

పెంచిన మెస్ చార్జీలు వెంటనే అమలు చేయాలి



నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు పెంచిన మెస్ చార్జీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక, ఏఐఎస్‌బీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం వారు జిల్లా బీసీ అదనపు సంక్షేమ అధికారి గంగా కిషన్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ లాల్‌సింగ్, మహేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారం ఇచ్చేవిధంగా మెనూలో మార్పులు చేసి కొత్త మెనూను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని అన్నారు.

ఏబీవీపీ నేతల దిష్టిబొమ్మ దహనం

నిజామాబాద్‌అర్బన్: సంగారెడ్డి ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై దాడి చేసిన ఏబీవీపీ నాయకుల దిష్టిబొమ్మను శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు దహనం చేశారు. అనంతరం జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ.. సంగారెడ్డిలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు యూనియన్ తోరణాలు, జెండాలు కడుతున్న సమయంలో ఏబీవీపీ నాయకులు అర్ధరాత్రి దాడి చేయడం సరికాదన్నారు. దాడికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు విఘ్నేష్, మహేష్, సాయి, ప్రసాద్, బాపురావు, నవీన్, కార్తీక్, రాజేష్ పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	60,900	వెండి (కిలో)	76,500
22 క్యారెట్స్	56,147	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు	డ్రెస్డ్	180
	(కిలోకు)	లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	750

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	16	గాజరుగడ్డ	30	50
బెండకాయ	20	40	పచ్చిమిర్చి	30	50
బీరకాయ	10	20	దోసకాయ	20	40
దొండకాయ	12	24	ఆలుగడ్డ	15	30
బీర్నీసుకాయ	20	40	గోబిగడ్డ	10	20
కాకరకాయ	20	40	గోబిపువ్వు	25	50
వంకాయ	12	24	బీట్‌రూట్	30	50
పాలకూర	40	60	కరివేపాకు	40	60
మెంతికూర	30	50	చామగడ్డ	30	50
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	35	60
పుదీనా	50	70	చిక్కుడుకాయ	35	60
క్యాప్సికం	30	50			

– సుభాష్‌నగర్

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



డిచ్‌పల్లి: రాష్ట్రస్థాయి పురుషులు, మహిళల సీనియర్ నెట్‌బాల్ టోర్నమెంట్‌కు మండలంలోని సుద్దులం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం రాజేశ్వర్ తెలిపారు. ఈసందర్భంగా పోటీలకు ఎంపికైన ప్రయణ్‌రెడ్డి, మధు, మహేశ్వరి, సుహాని, రిషికరెడ్డిను శుక్రవారం ఆయన అభినందించారు. ఈ నెల 9నుంచి 11వరకు నిర్మల్ జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి నెట్‌బాల్ టోర్నమెంట్‌లో వీరు పాల్గొంటారని తెలిపారు. సర్పంచ్ సీహెచ్ వెంకటేష్, ఉప సర్పంచ్ లక్కం రాంరెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ భూమేష్, వీడీసీ చైర్మన్ కృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఖుషి 10.20
	మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి: 1.25,7.30
	జవాన్(హిందీ): 4.20,10.30
స్క్రీన్-2	జవాన్(తెలుగు)-10.20,1.20,7.25
	ఖుషి(తెలుగు)- 4.20,10.30
స్క్రీన్-3	జవాన్(హిందీ)- 10.10,1.30,7.40, 10.50
	జవాన్(తెలుగు)- 4.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	జవాన్(హిందీ)- 11.30,3.05,6.40, 10.15
స్క్రీన్-2	జవాన్(హిందీ)-10.30,5.40,9.15
	జవాన్(తెలుగు)-2.05
స్క్రీన్-3	జవాన్(తెలుగు)- 11.05
	ఖుషి(తెలుగు)- 2.40,6.05
	మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి 9.30
స్క్రీన్-4	జవాన్(హిందీ)- 9.45
	ది నన్-2(ఇంగ్లీష్)- 1.50,7.35
	మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి 4.25
	ఖుషి -10.10
దేవి	ఖుషి
నటరాజ్	జవాన్(హిందీ)
లలితామహల్	మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి
విజయ్	జైలర్